క్లుప్తంగా

విరాళం అందజేత



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి సమీపంలో గల శ్రీదత్త కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న కోటిలింగాల ప్రతిష్ఠాపన, ధ్యాన కేంద్రం, పంచలోహ లింగం నిర్మాణంలో కార్యక్రమంలో భాగంగా కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన పద్మ, శివయాదవ్ దంపతులు తమ వంతు విరాళంగా రూ.27,116 విరాళంగా ఆలయ నిర్వాహకుడు శేఖరయ్యకు అందజేశారు. ఆలయంలో జరుగుతున్న పుణ్య కార్యక్రమాలకు దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేయాలని నిర్వాహకులు కోరారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి సన్మానం



వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన మాచర్ల అనూష నిర్మల్ జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించడంతో విద్యార్థినితో పాటు తల్లిదండ్రులు మాచర్ల పారిజాత, వెంకటేశ్వర్లగౌడ్ దంపతులను సీపీఎం నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. వైద్య వృత్తిలో ప్రతిభ కనబర్చి పేదలకు సేవ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ విజయ్‌గౌడ్, సీపీఎం నాయకులు వెంకటయ్య, ఆశన్న, మురళి, ఈశ్వర్, ఆంజనేయులు, ప్రవీణ్, రామకృష్ణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

బోనాల పండుగ



చిన్నంబావి: మండలంలోని కొప్పునూరులో గ్రామ దేవతకు బోనాల పండగను పెద్దల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి మేకలు, కోళ్లను బలిచ్చి భక్తులు మొక్కులను తీర్చుకున్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలోని అంగన్‌వాడీ మూడో కేంద్రంలో మంగళవారం పోషణ మాసం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదేళ్ల లోపు పిల్లలకు బరువు కొలిచారు. తల్లులకు గోల్డ్ కార్డు గురించి వివరించారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా ఆకు కూరలు, కూరగాయలు లాంటి పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బాలీశ్వరమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బుసిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు ఉమామహేశ్వరి, వెంకటేశ్వరమ్మ, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



పెబ్బేరు రూరల్: మండలంలోని తోమాలపల్లికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త కర్రె బుచ్చన్న అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక నాయకులు విషయాన్ని పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి తెలియజేయడంతో రూ. 5 వేలు ఆర్థిక సాయం పంపించారు. స్థానిక నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి నగదును అందజేశారు. కార్యక్రమంలో రంగన్న, శివకుమార్, సురేందర్‌గౌడ్, రమేష్, ఉమేష్‌గౌడ్, చిన్న మాసన్న రైతులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన



పెద్దకొత్తపల్లి: మండలంలోని నాయనోనిపల్లి మైసమ్మ దేవాలయ నిర్మాణ పనులను దేవాదాయ శాఖ డీఈ వేమూరి శ్రీనివాస్‌శర్మ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణం పనులను వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట ఏఈ బాలయ్య, ఈఈ రంగారావు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో గణేష్‌రావు, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

గురువులే మార్గ దర్శకులు

అమరచింత: సమాజంలో మంచి, చెడుల గురించి వివరించడమే కాకుండా విద్యను బోధిస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసే ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన వారికి శాలువా, పూలమాలలతో మంగళవారం ఘనంగా సత్కరించారు. సమావేశంలో ఎంఈఓ భాస్కర్ సింగ్ ,డీఎంఆర్ఎం హెచ్ఎం బాలస్వామి, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం బలరాముడు తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ

వనపర్తి టౌన్: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో టీజేఏసీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా స్థానిక రేడియంట్ హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. స్కూల్ డైరెక్టర్ రాములు యాదవ్ మాట్లాడుతూ... అన్నదానం ఆకలిని తీరిస్తే అక్షర జ్ఞానం అజ్ఞానాన్ని తొలగిస్తుందన్నారు. కార్యక్రమంలో రాజారామ్‌ప్రకాశ్, నాయకంటి నరసింహాశర్మ, డప్పు నాగరాజు, కవి రాము యాదవ్, బండలయ్య, పరమేశ్వరచారి, దేవేంద్రచారి, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్, రాము, రంగస్వామి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ, సరస్వతీ మాత చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మద్దిలేటి మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడమే మనం ఆయనకు ఇచ్చే అసలైన నివాళి అన్నారు. సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర కీలకమని, ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.

మదనాపురం: మండలంలోని దుప్పల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలరాజు, ఉపాధ్యాయులు ఆంజనేయులు, స్వాతి, రూప, అంగన్‌వాడీ టీచర్ తారమ్మ ఉన్నారు.

చిన్నంబావి: మండలంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఓ రమాదేవి మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత గురువులకే అంతటి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

పెబ్బేరు రూరల్: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని శ్రీరంగాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కవిరాజుగౌడ్, విజయ్, ఎల్లస్వామి , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తకోట: ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను రిలయన్స్ ట్రెండ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణ కేంద్రంలోని పద్మాలయ స్కూల్‌లో రిలయన్స్ సిబ్బంది ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు.



వనపర్తిలో..



పాన్‌గల్‌లో..



దుప్పల్లి పీఎస్‌లో..



చిన్నంబావిలో..

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం



ఆత్మకూర్: ఎడతెరపి లేకుండా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా దోమలు వ్యాప్తి చెంది డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉండడంతో పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో పాత ఇళ్లల్లో నివసించే వారు వర్షాలు తగ్గే వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, డ్రమ్ముల్లో, సంపుల్లో ఉన్న నిల్వ నీటిని పారబోయాలన్నారు. మున్సిపాలిటీ సిబ్బందితో నిత్యం పారుశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నామని, ఇతర సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

వీపనగండ్ల: సీజనల్ వ్యాధులతో ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత ఆశావర్కర్లపై ఉందని మండల వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. మంగళవారం ఆశా డే సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, నిర్ణయించిన లక్ష్యాల మేరకు ప్రతి ఒక్కరూ పని చేయాలని ఆదేశించారు. రికార్డుల నమోదులో జాగ్రత్త వహించాలని సూచించారు.

చట్టాలపై అవగాహన అవసరం

వనపర్తి టౌన్: చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకుంటే జనజీవన స్రవంతిలో ఉత్తమ పౌరులుగా రాణిస్తారని న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు డేగల కృష్ణయ్య అన్నారు. లోక్‌అదాలత్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మైనార్టీ ఆశ్రమ జూనియర్ కళాశాలలో మంగళవారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టాలు అందరికీ ఒకే రకంగా ఉంటాయని, వాటిపై అవగాహన ఉంటే సమాజంలో చెడును ప్రశ్నించే తత్వం అలవడుతుందన్నారు. గర్భంలో శిశువు నుంచి చట్టాలు అమలవుతాయని చెప్పారు. విద్యార్థులు బాధ్యతయుతంగా చదువుకొని సమాజానికి పేరు తేవడంతో పాటుగా జీవితంలో తల్లిదండ్రులను పోషించే బాధ్యతను వహించాల్సి ఉంటుందని, విస్మరిస్తే కఠిన చట్టాలు ఉన్నాయని వివరించారు. బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలనే ఉద్దేశ్యంతోనే బాల కార్మిక నిర్మూలన చట్టం అమలవుతుందన్నారు. కార్యక్రమంలో సఖికేంద్రం ప్రతినిధి మంజుల, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ జనార్దన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణయ్య

మహిళలకు అండగా ‘మిషన్ శక్తి’



ప్రభుత్వ కళాశాల విద్యార్థినులతో మిషన్‌శక్తి సభ్యులు

ఆత్మకూర్: శిశు సంక్షేమ శాఖ, డీహెచ్‌ఈడబ్ల్యూ మిషన్‌శక్తి ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులు, విద్యార్థినులకు మంగళవారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్యోగులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో మిషన్‌శక్తి జెండర్ స్పెషలిస్ట్ శ్రీవాణి మాట్లాడుతూ.. మహిళా ఉద్యోగులు మానసిక, శారీరక వేధింపులకు గురవుతుంటే మిషన్‌శక్తికి సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. ర్యాగింగ్ ఇతర సమస్యలు తలెత్తినప్పుడు 1098, 100, 181, 14567 హెల్ప్‌లైన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

‘ఆరోగ్యశ్రీ’ని సద్వినియోగం చేసుకోవాలి

కొత్తకోట రూరల్: ఆరోగ్య శ్రీ కార్డు సేవలు ప్రస్తుతం ఉన్న రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు పెంచారని, తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పామాపురం సింగిల్ విండో అధ్యక్షుడు వాసుదేవారెడ్డి అన్నారు. పీఏసీఎస్ పామాపురం పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు ఆరోగ్యశ్రీ సేవల కోసం పామాపురం పీఏసీఎస్ కార్యాలయంలో ఉచితంగా ఆన్‌లైన్ చేయించుకోవచ్చని వాసుదేవారెడ్డి కోరారు.

కేసు నమోదు

పెబ్బేరు: మండలంలోని రంగాపూర్ శివారులో 44వ జాతీయ రహదారిపై శ్రీజయగురు దత్త దాబాలో మద్యం అమ్ముతున్నారనే సమాచారంతో మంగళవారం తనిఖీ నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగదీశ్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆదేశాల మేరకు 44వ జాతీయ రహదారిపై ఉన్న దాబాల్లో మద్యం అమ్మకూడదని నిబంధనలు ఉన్నా.. అందుకు విరుద్ధంగా దాబాలో మద్యం అమ్ముతున్నారని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో రూ.11 వేల విలుగ చేసే మద్యాన్ని సీజ్ చేయడంతో పాటు యజమానులు సత్యానారాయణరెడ్డి, ప్రతాప్‌రెడ్డిపై కేసులు నమోదు చేసి, జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులకు అప్పజెప్పామన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

కోడేరు: మండలంలోని బాడిగదిన్నె తండాకు చెందిన 30మంది వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాజు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలోనే కాన్పులు సురక్షితం

పాన్‌గల్: పీహెచ్‌సీలో కాన్పుల సంఖ్య పెంచేందుకు ఆశా కార్యకర్తలు కృషి చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ చిరంజీవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలపై సిబ్బంది సమన్వయంతో గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి కాన్పు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చేయించాలని, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించాలని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో దోమలు పెరిగే అవకాశం ఉందని సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడంతో పాటు జ్వర బాధితులకు పీహెచ్‌సీ నుంచి సత్వరమే చికిత్స అందేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంఎల్‌హెచ్‌పీ లారెన్స్, సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, సంతోషమ్మ, వైద్య సిబ్బంది రాంచందర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ చిరంజీవి

ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి

కొత్తకోట: చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషిస్తున్న ఆశాలకు కనీస వేతనం కింద రూ.18వేలు ఇవ్వాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి భాగ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలంటూ మంగళవారం కొత్తకోట పీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేపట్టి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వైద్యాధికారికి అందజేశారు. కార్యక్రమంలో ఆశాలు మంజుల, సంతోష, రేణుక, శ్వేత, అర్చన, కాంచన, వరలక్ష్మి, లక్ష్మి, భాగ్యమ్మ, రజిత, పుష్ప తదితరులు ఉన్నారు.

అమరచింత: ఆశాల సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 11న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా సహ కార్యదర్శి ఆర్ఎన్ రమేష్ తెలిపారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలంటూ మంగళవారం పట్టణంలోని డీఎంఆర్ఎం పీహెచ్‌సీ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వైద్యాధికారి డాక్టర్ శరత్‌కు అందించారు. కార్యక్రమంలో శాంతమ్మ, సంధ్య, రాజేశ్వరి, జయసుధ, మహేశ్వరి, హాలిమ తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోటలో వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు

పాన్‌గల్: ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పీహెచ్‌సీ డాక్టర్ చిరంజీవికి అందజేశారు. కార్యక్రమంలో రేణుక, శ్యామల, అలివేలు, లలిత, లక్ష్మి, మహేశ్వరీ, అరుణ, శివరాణి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థ ఇళ్లల్లో నివసించొద్దు

కొత్తకోట రూరల్: రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తకోట ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కనిమెట్ట శివారులో గల పాతజంగమాయపల్లికి వెళ్లే రోడ్డుపై వంతెన నిర్మాణం జరుగుతుండటంతో గ్రామానికి వెళ్లేందుకు వేసిన తాత్కాలిక రోడ్డు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో పాతజంగమాయపల్లికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి మంగళవారం ఉదయం అక్కడకు వెళ్లి రోడ్డు తెగిపోయిన తీరును పరిశీలించి, ప్రజలు రాకపోకలు సాగించొద్దని రోడ్డుకు అడ్డంగా కంప వేయించారు. వాతావరణ అధికారుల సూచనల మేరకు రాష్ట్రంలో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తుండటంతో వాగులు, కుంటలు, దాటి వెళ్లాల్సిన వారు తమ ప్రయాణాలను రద్దు చేసుకోవాలని, అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని సూచించారు.



కమాలోద్దీన్‌పూర్ వెళ్లే దారికి వేసిన కంపను పరిశీలిస్తున్న తహసీల్దార్

కూలిన మట్టిమిద్దె

రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పెద్దమందడి మండలంలోని దొడగుంటపల్లికి చెందిన తప్పెట తిరుమలయ్య మట్టి మిద్దె కూలిపోయింది. దీంతో కుటుంబం వీధిన పడింది. ఇంటి పక్కన గల ఖాళీ స్థలంలో రేకుల షెడ్ ఏర్పాటు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. కాగా వర్షానికి కూలిన ఇళ్ల వివరాలను తహసీల్దార్ ఆదేశానుసారం ఆర్ఐ తిరుపతయ్య సేకరించారు. మండలంలో కూలిన ఇళ్లను పరిశీలించి వివరాలను ఉన్నతాధికారులను పంపిస్తామని ఆర్ఐ తెలిపారు.

పంట పొలాలకు చేరిన వరద

పాన్‌గల్: మండలంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి పంట పొలాలు, కుంటలు, చెరువుల్లోకి భారీగా వరద చేరింది. నెల రోజుల తర్వాత వర్షం కురవడంతో మెట్ట పంటలకు జీవం పోసిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చింతకుంట ఉన్నత పాఠశాల ఆవరణలోకి వర్షపు నీరు చేరడంతో పాఠశాలను సమీపంలోని నూతన భవనంలోకి మార్చారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని జానంపేటలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి గుంటి ఈశ్వర్‌సాగర్ ఇంటి మట్టి మిద్దె పాక్షికంగా కూలింది. పక్క గదిలో నిద్రిస్తున్న వారికి శబ్దం రావడంతో ఇంటి బయటకు పరుగు తీశారు. దీంతో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం స్పందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు. మంగళవారం తహసీల్దార్ మురళీగౌడ్, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, స్పెషల్ ఆఫీసర్ గ్రామాన్ని సందర్శించి శిథిలావస్థకు చేరిన ఇళ్లను పరిశీలించారు.

ఖిల్లాఘనపురం: మండలంలో వర్షాలు అధికంగా కురుస్తున్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పాండునాయక్, ఎస్ఐ శ్రీహరి సూచించారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన వారు వాగులు, వంకల వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెద్ద వాగుతో పాటు ప్రతి గ్రామంలో ఉన్న వాగులు, వంకలు పెద్ద ఎత్తున వరద వచ్చి చేరుతోంది. ప్రజలు వాగుల సమీపంలోకి వెళ్లవద్దని సూచించారు.



దొడగుంటపల్లిలో..



జానంపేటలో మట్టి మిద్దె ఇంటిలో నివసిస్తున్న వారికి అవగాహన కల్పిస్తున్న అధికారులు



బుసిరెడ్డిపల్లి శివారులో నీట మునిగిన వరి పంట

భైరోజుకు రాష్ట్రస్థాయి వ్యాఖ్యాత పురస్కారం

వనపర్తి టౌన్: పట్టణానికి చెందిన వ్యాఖ్యాత భైరోజు చంద్రశేఖర్ రాష్ట్రస్థాయి ఉత్తమ వ్యాఖ్యాత పురస్కారం అందుకున్నారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించాల్సిందిగా మూడు రోజుల క్రితం రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆహ్వానం పంపారు. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన రాష్ట్రస్థాయి గురుపూజోత్సవంలో వ్యాఖ్యాతగా వ్యవహరించి అతిథులను ఆకట్టుకోవడంతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, హోం శాఖ మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, ఏవీఎన్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ వ్యాఖ్యాత పురస్కారం అందుకున్నారు.



సబితా ఇంద్రారెడ్డితో పురస్కారం అందుకుంటున్న భైరోజు చంద్రశేఖర్

వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలి

కొల్లాపూర్: వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వారు పట్టణంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావును కలిశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి మాదిగ, నాయకులు సంపంగి మద్దిలేటి, పుట్టపాగ రాము, రాములు ఉన్నారు.